విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 8, ఏప్రిల్ 2025

దోబీ ఘాటకు ప్రభుత్వమే ఉచిత విద్యుత్ ఇవ్వాలి ..

విశాలాంధ్ర -అనంతపురం : దోబీ ఘాట్‌కు ఉచిత విద్యుత్ ఇవ్వాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాలస్వామికి ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనంతపురము నగర పాలక సంస్థ పరిధిలోని కలెక్టరేట్ ఎదుటనున్న చెరువులో ఒక దోబీఘాట్, బోరు మోటారు ఏర్పాటు చేసుకొని రజకులకు దాదాపు 25 సంవత్సరాల క్రితం సౌకర్యం కల్పించగా అక్కడ ఇప్పటికీ రజకు లంతా దుస్తులు ఉతుక్కొని జీవిస్తున్నారన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య ప్రభుత్వ నిధులతో దోబీఘాట్ దగ్గర కరెంటు సౌకర్యం కూడా కల్పించారు. సదరు కరెంటు బిల్లును గతంలో నగర పాలక సంస్థ భరించేదన్నారు. ప్రస్తుతం సదరు కరెంటు బిల్లులు రజకుల పేర్లపై వస్తున్నాయన్నారు. రజకవృత్తి చేసుకొని జీవిస్తున్న మాకు కరెంటు బిల్లు భారం లేకుండా చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి సివి హరికృష్ణ రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షులు సి నాగప్ప కార్పొరేటర్ శ్రీనివాసులు, సిజయరాములు, సి.కులయప్ప, సి షేక్షావలి, పి. మల్లికార్జున, సి.రాముడు, సి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం..

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని రాయలచెరువు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాయలచెరువు మెడికల్ అధికారులు డాక్టర్ దేవరాజ్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ శ్రీనివాసులు ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజ్, తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు రాయల చెరువు ప్రాథమిక ల్యాబ్‌ను, రికార్డ్స్ తనిఖీ చేశారు. ఎంపిహెచ్ఎ నారాయణస్వామి ఏంఎఫ్ టు డైరీ పరిశీలించారు. ఎంపిహెచ్ఈఓ లక్ష్మన్న పిహెచ్ఎన్ సుమతీదేవి సూపర్వైజర్స్ షబ్బీర్ అహ్మద్ ఏఎన్ఎం సబిత ఎంపిహెచ్ ఎం.నారాయణస్వామి ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత ఎంఎల్‌హెచ్‌పి ఉమాదేవి పాల్గొన్నారు.

అర్హత ఉన్న వైద్యులతో వైద్యం చేయించుకోవాలి..

విశాలాంధ్ర-రాయదుర్గం : అర్హత ఉన్న వైద్యులతోనే వైద్యం చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రమేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా భంభం స్వామి లేఅవుట్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో మాట్లాడుతూ ఆనందానికి, సంతోషానికి ఆరోగ్యమే కొలమానమని.. మంచి ఆహార అలవాట్లు, జీవనశైలి పెంపొందించుకోవాలని ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్య బోధకుడు కెంచె లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రక్త పరీక్షలు చేసి మాత్రలు ఉచితంగా అందిస్తారని.. నకిలీ వైద్యుల జోలికి వెళ్లి ప్రాణాలు హాని తెచ్చుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్ రాజ్ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి ..

విశాలాంధ్ర-ఉరవకొండ : లత్తవరం గ్రామ అభివృద్ధికి రైతులకు సంబంధించి అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ మాజీ సర్పంచ్ బోధపాటి గోవిందప్ప ఆధ్వర్యంలో సోమవారం రైతులు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కలిసి విజ్ఞప్తి చేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిం చడానికి లత్తవరం బ్రిడ్జి వద్దకు వచ్చిన సందర్భంగా పలు సమస్య లను ఏకరవు పెట్టారు. హంద్రీనీవా కాలువ వెడల్పులో భాగంగా ఇరువైపులా ఉన్న సాగుభూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని, కాలువకు సమీపంలోని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్ల పక్కకు ఏర్పాటు చేయాలని, డిస్ట్రిబ్యూటరీ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని, లత్తవరం రేణుమాకులపల్లి రాస్తాకు కాలువపై బ్రిడ్జి నిర్మించాలని, ముష్టూరు, లత్తవరం మధ్య తారురోడ్డు నిర్మించాలని కోరారు.

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : ఆరోగ్యకర సమాజాన్నినిర్మిద్దామని శ్రీధరఘట్ట పీహెచ్సీ వైద్యాధికా రులు,కుమార్ రాజ, గీతా భార్గవి అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించు కొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లా డుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్య పరిరక్షణకోసం మనం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకు రహిత సమాజానికి అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయ భారతి, వైద్య సిబ్బంది, ఆశావ ర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎన్‌సిసి క్యాడెట్ అవార్డు

విశాలాంధ్ర-జేఎన్టీయూఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(అనంతపురం) ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి అవార్డు గ్రహీత, కర్నూలు గ్రూప్ కొప్పోలు రోజిత, నేషనల్ క్యాడెట్ కార్ప్స్‌ను ప్రతిష్టాత్మక ఉత్తమ క్యాడెట్ అవార్డు గ్రహీతన వీసీ ఆచార్య హెచ్.సుదర్శన్‌రావు సత్కరించారు. కల్నల్ ఎల్.డి. రౌడ్రేజ్ మాట్లాడుతూ.. విద్యార్థి అసాధారణ నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించిందని-శిబిరాలలో అత్యుత్తమ ప్రదర్శన, పోటీలు, సమాజ సేవ పట్ల బలమైన నిబద్ధత, సామాజిక బాధ్యతతో విజయం సాధ్యం అయింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి, 6 (ఎ) గర్ల్స్ బిల్డింగ్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎల్. డి.రౌడ్రేజ్, ఎ.ఎన్.ఓ. క్యాంప్ ఆఫీసర్ శారద, పి.ఐ. సిబ్బంది అనిల్ కుమార్ పాల్గొన్నారు.

మిర్చికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి..

విశాలాంధ్ర-రాయదుర్గం : మిర్చికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రాయదుర్గం రైతు రక్షణ వేదిక అధ్యక్షులు, బీసీవై పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మిర్చి పంటలు పెట్టి గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు లబోదిబోమంటున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎంతోమంది రైతన్నలు లక్షలు వెచ్చించి పంటలు పెట్టి చేతికందాక అమ్ముకునేందుకు వెళితే కనీసం గిట్టుబాటు ధరలేక రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే రైతుల వద్ద నుండి రూ.11600లకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని కోరారు

యాపిల్ ఇండస్ట్రీతో పంచాయతీకి రాయల్టీ కట్టించండి

విశాలాంధ్ర-డీ.హిరేహాల్ : హిరేహాల్ గ్రామ పంచాయలో ఉన్న యాపిల్ ఇండస్ట్రీ గత 2010 సంవత్సరం నుండి 2025 ఎలాంటి రాయల్టీ కట్టలేదని సర్పంచ్ లక్ష్మి ఉప సర్పంచ్ కరడి మల్లికార్జున సోమవారం కలెక్టరకు ఫిర్యాదు చేశారు. 15 ఏళ్ల నుండి సుమారు రెండు కోట్ల 25 లక్షలు రెండువేల ఐదువందల రూపాయలు పంచాయతీ రాయల్టీ రావాల్సి ఉందని తెలిపారు. దీనికి సంబంధించిన జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస్ యాదవ్ విచారణ చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి

విశాలాంధ్ర-గుంతకల్లు: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలలో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని, ఫీజు నియంత్ర చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తాము అధికారంలోకొస్తే విద్యార్థులకు పెద్దపీట వేసామని, సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తామని నమ్మబలికి ఓట్లు వేపించుకొని గద్దెనెక్కిన ఎన్డీఏ ప్రభుత్వం 8 నెలల గడుస్తా ఉన్న విద్యారంగా సమస్యలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలం చెందారని పేర్కొన్నారు.. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ రూ.3580 కోట్లు బకాయిలకు రూ.788 కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపుకున్నారని పేర్కొన్నారు, ఒకవైపు కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం సర్టిఫికెట్లు ఎవరివి నిలబెట్టకండి అని విద్యాశాఖ మంత్రి చెపుతున్నప్పటికీ రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ పీజీ కళాశాల యాజమాన్యులు కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నారని మండిపడ్డారు, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దుచేసి రాష్ట్రవ్యాప్తంగా పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దు చేసి పాత పద్ధతుల్లోనే యూనివర్సిటీ సెట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు, డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్లు ప్రక్రియ నిలిపివేసి ఆఫ్‌లైన్ పద్ధతుల్లోనే నిర్వహించాలని పేర్కొన్నారు, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నెంబర్ 107 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు, రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధ నేతర పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.. కేజీబీవీ గురుకుల గిరిజన పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులు, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. హామీలు నెరవేర్చకపోతే రాష్ట్ర ప్రభుత్వం పైన ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ గుంతకల్ నియోజకవర్గ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, వెంకట్ నాయక్ కోశాధికారి అఖిల్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రోహిత్, శివమణి నాయకులు ఫర్హాన్, చిన్ని, రాజేష్, మధు, జయరాం, ధనుంజయ ,ముస్తఫా, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

సిపిఐ గంగాధర్

విశాలాంధ్ర-నార్పల :- అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సోమవారం తహసిల్దార్ అరుణాకుమారికి సిపిఐ గంగాధర్ వినతిపత్రం సమర్పించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నార్పల మండలాన్ని కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించినా ఎక్కడ కరువు సహాయ చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. మొన్న కురిసిన అకాల వర్షాలకు మండలంలో హార్టికల్చర్ పంటలు, అరటి, మామిడి, పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పంటల పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా రూ.20, వేలు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడతో రైతులు లక్షలాది రూపాయలు అప్పు చేసి అరటి, మామిడి, పంటలు సాగుచేసి అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, నారాయణప్ప అల్తాఫ్ సూరి, చంద్ర, శివ శంకర, నారాయణ, శ్రీను తిమ్మిరాజు నాగేంద్ర పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఆల్కలైన్ నీరు అందించడం అభినందనీయం

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

విశాలాంధ్ర-అనంతపురం : ఆరోగ్యకరమైన ఆల్కలైన్ నీరు తక్కువ ధరకు అందించడం అభినం దనీయని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మాసినేని గ్రాండ్‌లో శ్రీ బాలాజీ ఎంటర్ ప్రైజెస్ ఆల్కలైన్ వాటర్, వాటర్ సొల్యూషన్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి శ్రీ బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ ఆల్కలైన్ వాటర్, వాటర్ సొల్యూషన్ ప్రోపరేటర్ డివేణుగోపాల్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ప్యూర్ జల్ ప్రోపరేటర్ సీఈవో ఖాజా హుస్సేన్, జి జి హెచ్ సర్జన్ ఎం. రామస్వామి నాయక్, పావని హాస్పిటల్ చైర్మన్ గుత్తా రవీంద్ర, వికే రంగారెడ్డి పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఒకప్పుడు ఆల్కలైన్ వాటర్ అంటే సెలబ్రిటీస్, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు వారికి మాత్రమే అందుబాటులో ఉంటుందని అనుకునే వాళ్లం. ప్రస్తుతం రూ.20లకే ప్రజల్లోకి తీసుకొని రావడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. తనవంతుగా ప్రభుత్వ కార్యాలయాల్లో మినరల్ వాటర్‌కి బదులు అల్కలైన్ వాటర్ తాగే విధంగా ప్రమోట్ చేస్తామన్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా తాను ఆల్కలైన్ వాటర్ తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రజల ఆరోగ్య దృశ్యా ఈ వాటర్‌ని తక్కువ ధరలో తీసుకొని రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ రామస్వామి నాయక్ మాట్లాడుతూ... ఆల్కలైన్ వాటర్ తీసుకోవడం వల్ల అల్సర్, అసిడిటీ జబ్బులు రాకుండా ఉంటాయన్నారు. పావని ఆసుపత్రి అధినేత డాక్టర్ గుత్తా రవీంద్ర మాట్లాడుతూ... ఆల్కలైన్ నీరు తీసుకోవడం వల్ల ఎముకల పట్టుత్వం, అసిడిటీ ఇతర రోగాలు రావన్నారు. ఆల్కలైన్ వాటర్‌ను అనంతపురం ప్రజలకు తక్కువ ధరలో అందుబాటులోకి తేవడం పట్ల అభినందనలు తెలియజేశారు. అనంతరం ప్యూర్ జల్ బ్రోచర్లను ముఖ్య అతిథుల చేత విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్యూర్ జల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి..

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు

విశాలాంధ్ర-అనంతపురం : మంగళవారం జరగనున్న హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సమితి,, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, రాష్ట్ర రైతు సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు ఏ కాటమయ్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ ప్రకటించిందన్నారు. వెనుకబడిన, కరువు పీడిత ప్రాంతంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో మామిడి, అరటి, చీనీ, బత్తాయి, దానిమ్మ, టమాట, మిర్చి, కూరగాయలు, పూలు తదితర పంటలకు కేంద్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఉద్యాన పంటలకు అనువైన భూములు, కష్టపడి పండించే రైతులు ఉన్నా సాగునీటి వనరులు కరువైందన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సి.మల్లికార్జున మాట్లాడుతూ...90శాతం వరకు సబ్సిడీతో మైక్రోఇరిగేషన్ పథకాలు అందించేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉన్నా కరువుసీమలో జలసిరి పథకం ద్వారా అవసరమైన రైతులందరికీ 800 అడుగుల వరకు ఉచితంగా బోర్లు వేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యాన రైతుల సమస్యలను చర్చించేందుకు ఈ సదస్సు ఈనెల 8 న స్థానిక జిల్లా పరిషత్ హాల్లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, ఏఐకేఎస్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.పి సంతోష్ కుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవివి ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్, రాష్ట్ర రైతు సంఘం నిర్వాహక అధ్యక్షులు ఏ కాటమయ్య, జిల్లా పండ్లతోట రైతు సంఘం అధ్యక్షులు అనంత రాముడు పాల్గొనడం జరుగుతుందన్నారు. జిల్లాల నుండి ఉద్యాన రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, సింగనమల నియోజకవర్గం కార్యదర్శి పి నారాయణస్వామి, రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి పి రామకృష్ణ, సిపిఐ, రైతు సంఘం బండి రామక్రిష్ణ రమేష్ చలపతి నాయకులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకునష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించండి

విశాలాంధ్ర-శింగనమల : అకాల వర్షాల వల్ల పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నప్పయాదవ్ మాట్లాడుతూ మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, కాయగూరల పంటలు, మామిడి, చీని బొప్పాయి, అరటి, కర్బూజ, దోస, అనేకమైన పంటలు మూడు రోజుల కిందట కురిసిన వర్షాలకు అనేకప్రాంతాల్లో నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే రైతులకు, కౌలు రైతులకు, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాల కోసం విపత్తు నిర్వహణాల కింద రూ.5 వేల కోట్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని, వడగండ్ల వర్షాల వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఆరుగాలం శ్రమించి కష్టపడి పెంచిన పండ్ల మొక్కలు పంట చేతికి వచ్చే సమయానికి కాలి బూడిద అయిపోతున్నాయని, అందుకోసం ప్రభుత్వం వాటికి ప్రత్యేక ఉచిత బీమా సౌకర్యం ఏర్పాటు చేసి రైతులకు 100శాతం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. శింగనమల 544 డి జాతీయ రహదారి అంశంపై చాలాసార్లు జిల్లా అధికారుల దృష్టికి తెచ్చినా పరిష్కారం కాలేదు.. కానీ అక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయని.. దానికి ఎవరు బాధ్యులని నిలదీశారు, ఇప్పటికైనా మరవకొమ్మ హైవేలో సర్కిల్ ఏర్పాటు చేసి అక్కడ స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో శింగనమల రైతు సంఘం నియోజక వర్గఅధ్యక్షులు మధు యాదవ్, చేనేత కార్మిక సంఘం మండల కార్యదర్శి చేనేత మధు, సిపిఐ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, నారప్ప, రైతు సంఘం మండల అధ్యక్ష కార్య దర్శులు బయన్న చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు మునిస్వామి, రామ సుబ్బారెడ్డి, రుష్లానాయక్, జయరాంనాయక్ , చితంబరప్ప రామాంజినేయులు, బాలిరెడ్డి, రామక్రిష్ణ, ఈశ్వరమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాలువ

విశాలాంధ్ర-కనేకల్ : మండల పరిధిలోని హనకన్ హాల్ గ్రామంలోన సోమవారం రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు వాల్మీకులకు మూల పురుషుడైన రామాయణం రచించిన మహారుణి వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకులు ఐకమత్యంగా ఉంటూ అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మైనార్టీల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర-తాడిపత్రి: కూటమి ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జెసి. అస్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ములాంపులుపుల్ సర్కిల్లో ఉన్న సిద్ధి భాషా దర్గా వద్ద ముస్లిం మైనార్టీ మత పెద్దలు, ముస్లిం యువకులు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతుగా ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి తన నివాసం వద్ద నుండి ముస్లిం పెద్దలు, యువకులతో కలిసి ర్యాలీగా దీక్షా శిబిరం చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లులో ఏవైనా లోటుపాట్లు ఉంటే తప్పకుండ వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులు ఇచ్చిన అర్జీని మెయిల్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పంపుతామని తెలిపారు. 40 ఏళ్లుగా తాడిపత్రి ముస్లిం సమాజం తమ కుటుంబానికి అండగా నిలిచిందన్నారు.

బోయరెడ్డిపల్లిలో రాతి దూలం పోటీలు

విశాలాంధ్ర-యాడికి : మండలంలోని బోయరెడ్డిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం రాతి దూలం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యాడికి సీఐ ఈరన్న హాజరై రాతి దూలం పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలలో పెద్దపేట చెన్నారెడ్డి వృషభాలకు మొదటి బహుమతి రూ.14వేలు , ఈరన్న పల్లి వెంకటరాముడు రెండవ బహుమతి రూ.9 వేలు, కొత్తపల్లి విజయభాస్కర్ రూ.6 వేలు మూడవ బహుమతి, తాడిపత్రి నాగార్జున రూ.4 వేలు నాలుగవ బహుమతి, తాడిపత్రి లడ్డు రూ.3 వేలు, ఐదవ బహుమతి గెలుపొందారు. కార్యక్రమంలో పడమల శివ, గంగరాజు నగేష్, బోయరెడ్డిపల్లి హరి, లక్ష్మీనారాయణ, రామచంద్ర, వెంకట్రామిరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించి.. మా కుటుంబాలను ఆదుకోండి ..

శ్రీరామ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల విన్నపం

విశాలాంధ్ర -కళ్యాణదుర్గం టౌన్ : శ్రీరామ రెడ్డి త్రాగునీటి పథకంలో కాంట్రాక్ట్ కార్మికులుగా గత కొన్ని సంవత్సరాలుగా విధులను నిర్వహిస్తున్నామని.. పనికి తగ్గట్టుగా పరిహారం అందక, ఇచ్చే అరకొర జీతాలు కూడా సకాలంలోకి ఇవ్వక నానా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్డీఓ వసంత బాబుకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసి అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు రావాలంటే, ఉద్యోగం లోకి చేరినప్పటి నుంచి సమ్మెలు చేస్తే తప్ప మాకు జీతాలు అందట్లేదు అని వారు వాపోయారు. నేటికీ 6 నెలల జీతాలు, 30 నెలల పీఎఫ్ చెల్లించకుండా కాంట్రాక్టర్, మరియు అధికారులు కుమ్మక్కై కార్మికులను అన్యాయం చేస్తున్నారన్నారు. ఇదే విషయంపై పలుమార్లు కార్మికులు సమస్యను విన్నవించిన అరకొరగా నెల, రెండు నెలల జీతాలు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మికుల సమస్యలను త్వరితగదన పరిష్కరించాలని వారు వాపోయారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రంగనాథ్, వన్నూరు స్వామి, రామదాసు హనుమంత్ రెడ్డి శ్రీరామరెడ్డి భరత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ పొలం దారి అడ్డగింపు..

రైతుపై మూకుమ్మడి దాడి... అవమాన భారంతో ఆత్మహత్య యత్నం

విశాలాంధ్ర-నార్పల :- మండల పరిధిలోని మూగేతిమ్మాం పల్లి గ్రామానికి చెందిన వెంకటశివ అనే రైతుకు సంభందించిన 12 ఎకరాల వ్యవసాయ పొలం లోకి వెళ్లకుండా తిమ్మారెడ్డి, రాజశేఖర్, బ్రాహ్మయ్య, కేశవయ్యలు దారి అడ్డగించి సోమవారం మూకుమ్మడిగా దాడి చేయడంతో వెంకట శివ గ్లైసిల్ (గడ్డి మందు) తాగి ఆత్మహత్య యత్నం చేసాడు. ఆపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దాదాపు 8 నెలలుగా తమ పొలానికి వెళ్లకుండా అడ్డు కోవడం జరుగుతోందన్నారు. రెవెన్యూ అధికారులు దాదాపు 5 సార్లు కొలతలు వేసి పోలీసుల సమక్షంలో హద్దు రాళ్లు నాటినప్పటికి వాటిని దౌర్జన్యంగా తొలగించారు. వాటిని తొలగించొద్దని అడ్డు వెళ్లిన తన భర్త వెంకట శివ ను దారుణంగా కొట్టారని భార్య ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి రికార్డుల ప్రకారం తమ పొలానికి దారి చూపించాలని కోరుకుంటున్నారు.

మే 9,15న జేఎన్టీయూ కాన్వగేషన్

విశాలాంధ్ర-జేఎన్టీయూ ఏ: జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం 14వ కాన్వగేషన్ మే 9,15 తేదీలలో నిర్వహించుకునేందుకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ , కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ ఆమోద ముద్ర వేశారని వీసీ ఆచార్య హెచ్ సుదర్శన్ రావు పేర్కొన్నారు. సోమవారం పరిపాలన భవనంలోని సెమినార్ హాల్లో స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించేందుకు వీసీ, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య కమిటీల వారీగా సమీక్షించారు. వివిధ కమిటీల వారిగా బాధ్యతలను కేటాయించారు.

హార్టికల్చర్ రాష్ట్ర సదస్సుకు పిలుపు

విశాలాంధ్ర గార్లదిన్నె : ఏప్రిల్ ఎనిమిదో తేదీ జరగబోయే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గార్లదిన్నె మండలం కణంపల్లి గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీనాథ్ చౌదరి వన్నూరు స్వామి గ్రామ రైతులు పాల్గొన్నారు.

హార్టికల్చర్ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయండి

విశాలాంధ్ర ఆత్మకూరు : అనంతపురం నగరంలోని జడ్పీ హాలులో మంగళవారం జరిగే హార్టికల్చర్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని జిల్లా కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి నీళ్ల పాల రామకృష్ణ పిలుపు నిచ్చారు. ఈ సదస్సుకు ఆత్మకూరు మండలంలోని. అన్ని గ్రామ శాఖలలోని రైతు సంఘం నాయకులు, రైతులు, కౌలు రైతులు, పార్టీ సభ్యులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

గుత్తి ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం..

విశాలాంధ్ర గుత్తి : పట్టణం ప్రభుత్వ వైద్యశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అక్కడున్న నర్సులు, జూనియర్ డాక్టర్స్, సినియర్ వైద్యులు అక్కడ పనిచేసే సిబ్బంది హాజరయ్యారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ యల్లప్ప మాట్లాడుతూ హాస్పిటల్లో ఉన్న అన్ని సర్వీసుల గురించి ప్రజల్లో మంచి అవగాహన తీసుకురావడానికి అన్ని విధాలా కృషిచేస్తామన్నారు. సాధ్యమైనంత వరకు ప్రజలకు ఆరోగ్య పరంగా అన్ని విషయలల్లో, అన్ని సమయాలల్లో అందుబాటు లో ఉంటామని, ఇంకా హస్పేటల్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి పరుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రేణుకమ్మ,రేవతి, కేవీపీఎస్ మల్లికార్జున పాల్గొన్నారు.

నల్లమాడలో ఉపాధిలో రూ.లక్షల స్వాహా

హైవేకి మట్టి తరలించి పనులు చేసినట్లు మస్టర్లు

సమగ్ర విచారణ జరిపించాలని రైతుల వినతి

విశాలాంధ్ర-పుట్టపర్తి: గ్రామీణ ప్రాంతాల్లో వలసలు ఆపాలనే లక్ష్యంతో ప్రతి పేదవాడు పట్టెడన్నం తినాలని రెండు దశాబ్దాలుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు కొనసాగిస్తున్నాయి. పనిచేసి కొందరు ఫలితం పొందుతుంటే ఏ పని చేయకుండా లక్షలు కాజేస్తున్నారు మరికొందరు. రాత్రికి రాత్రి మస్టర్లు మార్చేసి దొంగ బిల్లులు పెట్టుకుని లక్షలాది రూపాయలు జేబులో వేసుకుంటున్నారు. సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేస్తున్న అనుకూలమైన అధికారులు చేత ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు మాయాజాలం చేస్తున్నారు. మా మండల స్థాయి అధికారుల అవినీతి బాగోతాన్ని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని మీరైనా దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించి నిజమైన నిరుపేదలకు న్యాయంచేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లి 585 సర్వే నంబర్‌లో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే కి సంబంధించి మట్టిని తరలిస్తే అందులో ఉపాధి హామీ పనులు చేసినట్లు అధికారులు బిల్లులు చేసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ వర్క్ ఐడి నెంబర్: 0212047004 పేరిట గత ఏడాది ఆగస్టు 26న పనిచేసినట్లు 5,4380722 లక్షల రూపాయలు నిధులు స్వాహా జరిగింది. ఉపాధి హామీ వర్క్ ఐడి నెంబర్: 0212047004 పేరిట గత అక్టోబర్ ఒకటో తేదీన రూ.5,0341235 లక్షలు స్వాహా చేశారు. 2024 సంవత్సరంలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి మట్టి తవ్వకునేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా.. ఈ సమయంలో అక్కడ మట్టి తవ్వకాలు చేపడితే ఉపాధి హామీ పనులు చేసినట్లు మస్టర్లు తయారు చేసి బిల్లులు స్వాహా చేశారని రైతులు మండిపడుతున్నారు. ఉపాధి హామీ పథకం 2020, 21, 22 సంవత్సరాల్లో పనులు చేస్తే బిల్లులు మంజూరు చేయలేదని మండలాధికారుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. మూడేళ్లు పనులు చేస్తే ఇంత వరకు బిల్లులు రాలేదు ...2020, 21, 22 సంవత్సరాలలో రెడ్డిపల్లి గ్రామ పొలంలో జాబ్‌కార్డు నెంబర్: 121624704003010597 పేరిట పనులు చేస్తే ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదు ఇదేమని ప్రశ్నిస్తే ఎవరూ సమాధానం ఇవ్వడం లేదు. 60 బిల్లులు రావాల్సి ఉంది. ఈ క్రమంలోనే నకిలీ బిల్లుల పేరిట 30 లక్షల రూపాయలు అధికారులు స్వాహా చేశారని ఫిర్యాదు చేశారు. వారి అవినీతి బాగోతాన్ని తాను ఎత్తిచూపానని గతేడాది ఏప్రిల్ నుంచి నాకు ఉపాధి హామీ పని లేకుండా చేశారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

రసాయనిక ఎరువులను తగిన మోతాదులో వాడాలి

విశాలాంధ్ర, కదిరి : రసాయనిక ఎరువులను తగిన మొత్తాదులో వాడాలని.. విత్తన ధృవీకరణపై ఏపీ ఎస్ఓ రవి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతులు కోసం చౌడేశ్వరి ఎఫ్ ఏ సీ లిమిటెడ్ ద్వారా నమోదు చేసుకున్న డివిజన్‌లోని 30 మంది రైతుల పొలాలను పరిశీలన చేశారు.అనంతరం పురుగు మందుల అవశేషాల పరీక్ష నిమిత్తం విత్తన నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఓపి సీఏ వెంకటేష్, ఏడిఏ సనావుల్ల, సత్యనారాయణ, సీఈవో బాబ్ జాన్, వ్యవసాయ అధికారులు శ్రీనివాసుల రెడ్డి, లలిత,విమల,నవీన్ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేట కొడవళ్ళతో ఆకతాయిల వీరంగం..

మద్యం మత్తులో మహిళపై దాడి

ఇద్దరిపై కేసు నమోదు..

విశాలాంధ్ర-లేపాక్షి : గ్రామ సరిహద్దులో ఉన్న అనధికారిక బెల్ట్‌షాప్‌లో మద్యం సేవించి ఇద్దరు ఆకతాయిలు వేట కొడవళ్లతో దాడులు చేసుకున్న సంఘటన ఆదివారం అర్ధరాత్రి కోడిపల్లిలో చోటుచేసుకుంది. ఎప్పటిలాగే మద్యం సేవించడానికి వెళ్లిన ఇద్దరు ఆకతా యిలు తప్ప తాగి వ్యక్తిగత విషయాల్లో మాటా మాట పెద్దదై వేటకొడవళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేస్తున్నారు. అయితే గాయపడిన వ్యక్తి మరికొందరు కలిసి దాడి చేసిన వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. ఆ సమయంలో అతను లేకపోవడంతో ఇంట్లో ఉన్న భాగ్యమ్మపై కొడవలితో దాడి చేయడంతో ఆమె కుడి చేతికి గాయాలయ్యాయి. కొడవళ్లతో కేకలు వేయడంతో ఒక్కసారిగా కోడిపల్లి ఉలిక్కిపడింది. అధికార పార్టీ నాయకులు ఎన్ని ఒత్తిళ్లు చేసిన గ్రామంలో విచారించి ఇరువురి ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్టు లేపాక్షి ఎస్ఐ నరేందర్ తెలిపారు. కొత్తపల్లి క్రాస్ లో ఉన్న అనధికారిక బెల్టు షాపును వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

పాపిరెడ్డిపల్లిలో నేడు జగన్ పర్యటనకు ఏర్పాట్లు

విశాలాంధ్ర-పెనుకొండ : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామాన్ని మంగళవారం సందర్శిస్తున్నందున అన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ రత్న తెలిపారు. సోమవారం పెనుకొండలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత నెల 30వ తేదీన జరిగిన గొడవలో లింగమయ్య అనే వ్యక్తి చనిపోయాడని, అతను వైసీపీ సాను భూతిపరుడుగా ఉండడం అతని కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్మోహన్ రెడ్డి విచ్చేస్తున్నందున ఎటువంటి ఇబ్బందులు జరగకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని తెలిపారు పాపిరెడ్డిపల్లి గ్రామంలోనికి వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేనందున ఎక్కువమంది వెళ్లడానికి సౌకర్యం లేనందున జగన్మోహన్ రెడ్డి వెంట అందరూ వెళ్లడానికి వీలు కాదు కావున వైయస్ జగన్ అభిమానులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని కోరారు. పోలీసులు కాన్వాయిని అనుసరించి వైయస్ జగన్ కు జెడ్ కేటగిరి భద్రత ఉంటుంది కావున భద్రత దృశ్య ఎక్కువమంది కలవడానికి వీలు ఉండదు.. సమయానం పాటించాలన్నారు. మృతుడు లింగమయ్య కుమారుడు మాట్లాడిన విధంగా వారి తండ్రి మీద దాడి చేసింది నలుగురని పోలీసులు కేసును తప్పుతోవ పట్టిస్తున్నారని మాట్లాడిన దాని మీది కూడా ప్రత్యేకంగా విచారణ చేసి మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని తెలిపారు, అయినా వారు చెప్పిన విధంగా ఇంకా ఎవరైనా నిందితులు పాల్గొని ఉంటే నిష్పక్షపాతంగా కేసు దర్యాప్తు చేస్తామని తెలిపారు.

ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపండి

- 22, 23న బండ్లపల్లి నుండి అనంతపురం వరకు పాదయాత్రను విజయవంతం చేయండి
- సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర, పుట్టపర్తి: ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపాలని, ఉపాధి హామీ పనిని వ్యవసాయానికి అనుసంధానం చేయరాదని శ్రీ సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సాయి ఆరంభంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి అధ్యక్షతన జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేమయ్య యాదవ్ మాట్లాడుతూ ఉపాధి హామీలో రాష్ట్ర మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసి అందులో వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధులను చేర్చాలన్నారు. మండల స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘాలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పనులపై ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామ సభలో పనులను ఎంపిక చేసి వాటిని బహిరంగంగా వెల్లడించాలన్నారు. ఉపాధి హామీ పనులలో సామాజిక తనిఖీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న ప్రదేశంలో ప్రమాదాల్లో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించా లన్నారు. కుటుంబ జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి కార్మికునికి విధిగా జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. ఏప్రిల్ 22, 23 వీధిలో చేపట్టిన పాదయాత్రకు పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, నియోజకవర్గం కార్యదర్శి అంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కులయప్ప, జిల్లా కార్యదర్శి కదిరప్ప, రమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొండయ్య, చౌడప్ప, ఆదినారాయణ, విమల భాయ్, జ్యోతి ,శివమ్మ, గంగాద్రి,ఇందిరా బాయ్, కళావతి పాల్గొన్నారు.

పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ తాసిల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాముల నేతృత్వంలో శ్రీకృష్ణదేవరాయ కాలనీ నందు నివసిస్తున్న పేద కుటుంబాల వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని నిరసన వ్యక్తం చేస్తూ తాసిల్దార్ శ్రీధర్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు, పెనుకొండ పొలంలోని సర్వే నంబర్ 272 నందు గొనిపెంట రోడ్డులో కొంతకాలంగా పేదలు నివసిస్తున్నారు.. వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వం ఏ సహాయం చేయకుండా వారే స్వతహాగా బోర్లు వేసుకొని తాగునీటి సరఫరా చేసుకుంటున్నారని, అలాగే నీటి ట్యాంకు కూడా నిర్మించుకున్నారని వారి భద్రత కోసం ప్రభుత్వము వెంటనే చర్యలు తీసుకొని ఇంటి పట్టాల మంజూరు చేయాలని నినాదాలు చేశారు, పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు భూమి ఇస్తామని గత ఎన్నికలలో ఇచ్చిన ఎన్నికల హామీని ప్రభుత్వము నిలబెట్టుకోవాలని పేదలకు నివాస స్థలాలకు ఇంటి పట్టాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం తగదని ప్రభుత్వం పై సిపిఐ శ్రీరాములు, ధ్వజమెత్తారు, ఉన్నతాధికారులు వారు ఉన్న ఇంటి స్థలాలను పరిశీలించి పట్టాలు మంజూరు చేయుటకు కృషి చేయాలని శ్రీరాములు కోరారు, అనంతరం దండోరా నాయకుడు రామాంజనేయులు, మాట్లాడుతూ ప్రభుత్వము దళితుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని పేద, బడుగు బలహీన వర్గాల వారు కొంత ఇంటి స్థలానికి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని తెలిపారు,ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నరసింహ, వెంకటేశులు, మల్లికార్జున, వెంకటరాముడు, కిష్టప్ప, వెంకట లక్ష్మమ్మ,నిజాం, దండోరా నాయకుడు నరసింహ, కాలనీవాసులు పాల్గొన్నారు.

మొబైల్ మెడికేర్ మిషన్ ప్రత్యేకమైన సేవ

విశాలాంధ్ర-బత్తలపల్లి : బత్తలపల్లి మండలంలో హాస్పిటల్ ఆన్ వీల్స్ అనే వైద్య శిబిరాన్ని సోమవారం ఎంపీ. పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నియోజకవర్గంలో ఇటువంటి వైద్యశిబిరాలు నిర్వహించడం వల్ల ప్రజలకు చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మొబైల్ మెడికేర్ మిషన్‌ను వారు ప్రారంభించి, ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రజలకు అంకితం చేశారు. ఇది ఆసియాలోనే తొలిసారిగా అందించబడుతున్న ప్రత్యేకమైన సేవ అని తెలిపారు. ఈ శిబిరం రాష్ట్ర ఆరోగ్యశాఖ సహాయంతో నిర్వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య సేవలు ఆధునిక నిర్ధారణ పరికరాలతో అందించడం శుభదాయకం అన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రథం అనే పేరుతో సేవలను మారుమూల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజల వరకు చేరేలా తయారు చేయబడిందన్నారు. మందులు పంపిణీ చేశామన్నారు. వైద్య బృందాల ద్వారా ఉచిత వైద్య పరీక్షలు ఓపిడి, ఎక్సెరే సేవలు, లాబరేటరీ పరీక్షలు, కంటి స్క్రీనింగులు, ముక్కు, నాడి, ఎన్సీడీ స్క్రీనింగ్ కూడా అందించామన్నారు.. కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, డీఎంహెచ్వో, డిప్యూటీ డీఎంహెచ్వో, మెడికల్ కోఆర్డినేటర్ ప్రదీప్, దయాకర్, బీజేపీ మండల అధ్యక్షులు ఆకులేటి భాస్కర, టిడిపి మండల కన్వీనర్ నారాయణరెడ్డి, గోనుగుంట్ల విజయ్ కుమార్, మహేష్ చౌదరి, కోటి బాబు, ఆకులేటి వీరనారప్ప పాల్గొన్నారు.

కబ్జాకు గురైన మా భూమిని ఇప్పించండి మహాప్రభో..

రాత్రికి రాత్రే గిరిజనుల భూమిలో మామిడి మొక్కలు నాటిన వైనం..

విశాలాంధ్ర-పుట్టపర్తి :ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా తమకు ఇచ్చిన అసైన్డ్ భూమిని కొంతమంది భూ కబ్జాదారులు కన్నేసి రాత్రికి రాత్రే ఆ భూమిలో ఉన్న ముళ్ళ చెట్లను తొలగించి మామిడి మొక్కలు నాటారని సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ టీ.ఎస్.చేతన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 2012లో భూ పంపిణీలో భాగంగా బత్తలపల్లి మండలం దంపెట్ల రెవెన్యూ పొలంలోని సర్వేనెంబర్ 107 లో వున్న దాదాపు 26.72 ఎకరాల భూమిని సూర్యచంద్రాపురం గ్రామానికి చెందిన 11 మంది ఎస్టి గిరిజన రైతులకు ఒక్కొక్కరికి 2 ఎకరాలు చొప్పున ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. అయితే నెల రోజులుగా మా భూమిని కబ్జా చేసేందుకు దంపెట్ల గ్రామానికి చెందిన బోయ హరిదాసు కుటుంబీకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన రీ-సర్వేలో ఆ భూమి దంపెట్ల రెవెన్యూ పొలం క్రింద వస్తుందని తెలిసిన తర్వాత మా భూమిలో ఉన్న ముళ్లపొదలను తొలగిస్తుండగా వారు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య భూ వివాదం నెలకొందని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఇరువురిని పోలీసులు బైండోవర్ చేసి పరిశీలన జరిగే వరకూ ఆ భూమిలోకి ఎవరు వెళ్లకూడదని బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత ఇరువురికి సూచించారన్నారు. అయితే కూటమి నేతల అండతో బోయ హరిదాసు కుటుంబసభ్యులు ప్రభుత్వ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ, వివాదంలో ఉన్న భూమిలోకి దౌర్జన్యంగా వెళ్లి రాత్రికి రాత్రే మామిడి మొక్కలు నాటారని తెలిపారు. విచారించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో రైతులు నాగశేషు,పెద్దన్న, వెంకటేష్ ,సూర్యనారాయణ,ఆదినారాయణ, లక్ష్మినారాయణ, నాగేంద్రమ్మ, వనజ,లావణ్య, రామలక్ష్మి ఉన్నారు.

క్రీడలతో శరీర దృఢత్వం, ఆరోగ్యం

విశాలాంధ్ర -ధర్మవరం : క్రీడలు శరీర దృఢత్వాన్ని ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ముఖ్యఅతిథి సందారాఘవ తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న రాష్ట్ర హాకీ పోటీ కార్యక్రమానికి టిడిపి నాయకుడు సందా రాఘవ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వీరితో పాటు వన్టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, పళ్లెం వేణుగోపాల్, ఉడుముల రామచంద్ర, కలవల మురళీధర్ కూడా ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హాకీ ఏపీ స్టేట్ ఉపాధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ హాకీ క్రీడలను జాతీయ స్థాయికి తెచ్చేందుకు విశేష కృషితో ముందుకు వెళుతున్నామని తెలిపారు. రెండో రోజు హాకీ క్రీడా పోటీల్లో ప్రకాశం-అనంతపురం తలపడగా అనంతపురం మూడు గోల్‌లతో విజయం, విశాఖపట్నం-ఏలూరు తడపడగా విశాఖపట్నం 8 గోల్‌తో విజయం, కడప- ఎన్టీఆర్ తరపడగా ఏడుగోలుతో కడప విజయం, అన్నమయ్య-గూడూరు తలపడక అన్నమయ్య ఆరు గోల్‌తో విజయం, అనకాపల్లి-వెస్ట్ గోదావరి తలపడగా అనకాపల్లి 6 గోల్తో విజయం, ఏలూరు-శ్రీకాకుళం తెలపడగా శ్రీకాకుళం విజయం, కాకినాడ-చిత్తూరుతలపడగా కాకినాడ 6 గోల్తో విజయం, సత్యసాయి జిల్లా-బాపట్ల తలపడగా సత్యసాయి జిల్లా 2 గోల్తో విజయం, నంద్యాల-అనంతపురం తలపడగా అనంతపురం ఐదు గోల్‌తో విజయం సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గౌరీ ప్రసాద్, కోశాధికారి అంజన్న, హాకీ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు

కళలను విస్తరింపజేస్తాం..

విశాలాంధ్ర-ధర్మవరం : హిందూ సాంప్రదాయ కళలను విస్తరింప చేయడమే మా లక్ష్యమని శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు-బాబు బాలాజీ, కమలా బాలాజీ తెలిపారు. సోమవారం కదిరి తాలూకా కటారుపల్లి గ్రామంలో యోగివేమన ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా ధర్మవరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామ లాలీత్యాల శిష్య బృందం 15 మంది ప్రదర్శించిన భరత నాట్యం, కూచిపూడి, రామరసామృతం, నృత్య రూపకం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఆర్గనైజర్ వేమారెడ్డి గురువులను ప్రత్యేకంగా సన్మానిస్తూ శిష్య బృందం 15 మందికి మెమెంటోలను, ప్రశంసా పత్రాలను బహుకరించారు.

కోచింగ్‌తో విద్యా నైపుణ్యం పెంపు

విశాలాంధ్ర-ధర్మవరం : కోచింగ్ అనేది విద్యార్థులను విద్యతో కూడిన నైపుణ్యాన్ని మరింతగా ప్రోత్సహిస్తుందని కరెస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ తెలిపారు. సోమవారం రేగాటిపల్లి రోడ్డు లోపల వివేకానంద డిగ్రీ కళాశాలలో ఉచిత కోచింగ్ తరగతులకు విద్యార్థుల ద్వారా విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు కోసం మా కళాశాలలో పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ, ఆర్జీటి ప్రవేశ పరీక్షల కోసం ఉచిత బోధనలు అందించడం మాకెంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. పేదరికానికి విద్య అడ్డుకాకూడదన్న ఉద్దేశంతోనే తాము ఉచిత కోచింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, భవిష్యత్తులో మంచి విద్యను అందించుకోవాలని తెలిపారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ..

విశాలాంధ్ర-ధర్మవరం : రాష్ట్ర పార్టీ పంపిన తెలుగుదేశంపార్టీ సభ్యత కార్డులను, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో బూతుల వారిగా నియోజకవర్గంలో గల నాయకులకు కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతంకాటమయ్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర్మవరం నియోజకవర్గంలో రికార్డ్ స్థాయిలో 65 వేల సభ్యత్వాలు నమోదు చేపట్టడం జరిగిందని, ప్రజలు చంద్రబాబునాయుడు నాయకత్వంపై విశ్వాసం ఉంచి పార్టీ సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. సభ్యతం తీసుకున్న ప్రతి ఒక్కరికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలియజేశారు.

మంచి ఆరోగ్యమే భవిష్యత్తుకు పునాది

విశాలాంధ్ర-ధర్మవరం : మంచి ఆరోగ్యమే భవిష్యత్తుకు పునాది అవుతుందని స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రజలకు వైద్యులకు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన వైద్య చికిత్సలను అందించుకోవాలన్నారు. సొంత వైద్యం ప్రాణానికే ముప్పు అవుతుందని తెలిపారు. బయట తినే ఆహారానికి దూరంగా ఉంటూ, ఇంట్లోనే వన్డే ఆహారాన్ని భుజించినప్పుడు చక్కటి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. చక్కెర ఎక్కువగా ఉండే కాఫీ, టీ, శీతల పానీయాలు, కూల్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్ తీసుకోరాదన్నారు. చిన్నపిల్లలకు విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉండే గోధుమ, జొన్న, మొక్కజొన్న రాగులతో చేసిన పదార్థాలను తినిపిస్తే మరీ మంచిదని తెలిపారు. వృద్ధులలో చాలావరకు డయాబెటిస్ హైబీపీ గుండె జబ్బులు బిపి షుగర్ వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయని, ఎప్పటికప్పుడు ఆసుపత్రులలో వైద్యం పొందాలని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు గర్భం దాల్చాక క్రమం తప్పకుండా అవసరమైన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాయామం, వాకింగ్ వల్ల గుండె వేగం పెరగడంతో పాటు ప్రతి కణానికి కండరానికి ఆక్సిజన్ అందుతుందని చెప్పారు

సి వై, టిబి చర్మ పరీక్షలు నిర్వహించండి

విశాలాంధ్ర-ధర్మవరం : సివై, టీబీ చర్మ పరీక్షలు క్షేత్రస్థాయిలో తప్పకుండా అమలు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి సంక్రమణ సివై టివి చర్మ పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ పరీక్షలు ప్రతి ప్రభుత్వ హెల్త్ సెంటర్ నందు ఉచితంగా వైద్య చికిత్సలను అందిస్తారని తెలిపారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పుడు జరిపిన పరీక్షల్లో సంక్రమణ నిర్ధారణ అయితే టీబీ జబ్బు రాకుండా మందులు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ప్రియాంక, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, టీబీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలి

విశాలాంధ్ర-గోరంట్ల : 2001లో సీఎం చంద్రబాబు నాయుడు ఉర్దూ భాషాభివృద్ధి కోసం రోష్ని స్కీం ప్రారంభించి, రూరల్, అర్బన్ మైనార్టీ పరిసర ప్రాంతాలలో 300 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి, ప్రతి పాఠశాలకు రెండు ఉర్దూ ఎస్జీటీ పోస్టులు మంజూరు చేశారని రోష్ని స్కీం పునఃప్రారంభించి ముస్లిం మైనారిటీ ఏరియాలలో కనీసం 500 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ప్రతి పాఠశాలకు రెండు ఉర్దూ ఎస్జిటి పోస్టులతో సహా ప్రారంభించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె. ఫైరోజ్ అహ్మద్ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. మెగా డీఎస్సీలో భాగంగా స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జై భీమ్ ర్యాలీలో పాల్గొనాలని సిపిఐ నాయకులకు ఆహ్వానం

విశాలాంధ్ర- పెనుకొండ : పెనుకొండలో సోమవారం 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా జై భీమ్ నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని సోమవారం సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు నేతృత్వంలో సీపీఐ నాయకులను బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ వారి బృందం కలసి కరపత్రాలను పంచి ప్రత్యేకంగా ఆహ్వానించారు, ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి జై భీమ్ ర్యాలీ నిర్వహించడం దళితులలో చైతన్యం తీసుకురావడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న ఉన్నత వర్గాల వారే రాజ్యాధికారంలో ప్రభుత్వ ఫలాలు తింటూ అట్టడుగు వర్గాల ప్రజలు నష్ట పోతున్నారని.. దళితులందరూ ఐక్యంగా ఉండి ఎన్నో సాధించుకోవాల్సిన అంశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకటేష్లు, నరసింహ, మల్లికార్జున, వెంకట లక్ష్మమ్మ, బహుజన చైతన్య వేదిక సభ్యులు, వెంకటేశులు, రవి, బాబు, అద్రస్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం..

విశాలాంధ్ర కదిరి: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని 36 వార్డుల్లో నివాసముంటున్న ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ కే కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. పార్నంపల్లి నుండి మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న సందర్భంగా మోటర్ చెడిపోవడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిం దని పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుడు అకాల మృతి..

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నగర పంచాయతీలు నీటి సరఫరా విభాగంలో పనిచేస్తున్న ఓబులేసు (45) కాలేయం వ్యాధితో బాధపడుతూ సోమవారం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని మృతదేహాన్ని పెనుకొండ కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది ఆయనకు నివాళులర్పించారు.

ఘనంగా మారమ్మ దేవి జలాధి ఉత్సవం

విశాలాంధ్ర- గుడిబండ : మండల కేంద్రంలో వెలసిన శ్రీ తుమ్మల మారమ్మ దేవి జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూలలతో అలంకరించి గుడిబండ, సింగేపల్లి, మోపురగుండు,కె.జి.ఎన్ పాళ్యం, పి.జి. హట్టి, హెచ్.ఆర్.హట్టి గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి మూలవిరాట్ విగ్రహాన్ని గ్రామ సమీపంలోని చెరువులో జలాధి ఉత్సవం నిర్వహించారు. గంగపూజ గణపతి పూజ, కళశ స్థాపన,మహా మంగళారతి నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కరుణాకర్ గౌడ్, ఎంపీటీసీ వనజా శశిధర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శిగా వీరయ్య

విశాలాంధ్ర-హిందూపురం : ఎమ్మెల్యే లెజెండ్ నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శిగా వీరయ్య సోమవారం నియమితులయ్యారు. ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్యను మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్, కమీషనర్ సంఘం శ్రీనివాసులు, తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు కొల్లకుంట్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు, కిరీకెర మాజీ సర్పంచ్ రాము, తో పాటు హిందూపురం నియోజకవర్గ తెలుగుదేశం అభిమానులు కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

టీడీపీతోనే వాల్మీకి బోయలకు న్యాయం

విశాలాంధ్ర-అగళి : తెలుగుదేశం పార్టీతోనే వాల్మీకి బోయలకు న్యాయం చేకూరుతుందని వాల్మీకులు రాజు, రమేష్ తెలిపారు.రామాయణం రచించిన మహర్షి వాల్మీకి వారి వర్గానికి రఘువీరా చేసిన అన్యాయం బోయ కులస్తులు ఎప్పుడు మరవలేరని అధికారంలో ఉన్నప్పుడు రెండుసారు మంత్రివర్గంలో ఉన్న కూడా రాయలసీమలో అత్యధికంగా ఉన్న వాల్మీకి బోయలను ఏనాడు కూడా పట్టించుకోలేదన్నారు. గుండుమాల తిప్పే స్వామి ఎమ్మెల్యే రాజు వారి వెంట ఉన్నామని తెలిపారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తులకు సౌకర్యాలు కరవు

విశాలాంధ్ర-రొళ్ల:- స్థానిక లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాలకు హాజరైన కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆలయ కమిటీ వారు పూర్తిగా విఫలమైనరాని భక్తులు ఆరోపిస్తున్నారు. ఏటా కానుకలు హుండీలా ద్వారా అధిక మొత్తంలో ఆదాయం సమాకూరుతున్న మహిళలకు బాత్ రూమ్ లు మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. గతేడాది నుంచి హుండీల ద్వారా కానుకలు ద్వారా వచ్చిన మొత్తానికి ఖర్చుల వివరాలు వివరించక పోవడంపై కైవాడస్థులు పెదవి విరుస్తున్నారు.ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాల ద్వారా వచ్చిన హుండీ ని గత మూడు రోజులు క్రితం పగలగొట్టి లెక్కింపు చేపట్టిన లెక్కింపు పూర్తి కాలేదు.అలానే రూమ్ లో భద్రపరచామని చెప్పుతూ కాలయాపనం చేయడంపై భిన్నభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కన్నుల పండువగా బ్రహ్మారథోత్సవం

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు లో కోదండ రాముని బ్రహ్మ రథోత్సవం కన్నుల పండువగా సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు ఎంపీ పార్థ సారధి అనంతపురం ఎంపీ అంభికా లక్ష్మీనారాయణ హిందుపురం ఎమ్మెల్యే సహాయ కార్యదర్శి వీరయ్య పెద్దలు దేమకేతేపల్లి అంజినప్ప మున్సిపల్ చైరపర్సన్ డీఈ రమేష్, మండల కన్వీనర్ రంగారెడ్డి ,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, వాల్మీకి బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దేవనహల్లి ఆనంద్, జిల్లా అధ్యక్షులు అంజినప్ప ముఖ్య అతిథులుగా హాజరైనారు, ఈ నేపథ్యంలో అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలు చేశారు. మంగళ వాయిద్యాలు నడుమ స్వామి వారిని బ్రహ్మరథమై కూర్చుండబెట్టి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. టీడీపీ నాయకులు నాగరాజు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, తిప్పారెడ్డి వెంకటలక్ష్మి, శ్రీదేవి, నందీశప్ప,మంగేష్, అశ్వర్థప్ప, అంజమ్మ, మాజీ సర్పంచ్ చెన్నమ పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 08, ఏప్రిల్ 2025

ద్విచక్ర వాహనదారులపై కుక్కలు దాడులు..



విశాలాంధ్ర - కనేకల్ : కనేకల్ పట్టణంలోని ఉరవకొండ రోడ్డులో కూసంత దూరంలో చెరువుగట్టు దగ్గర సర్కిల్ నందు ప్రతిరోజు కనేకల్ నుండి కలేకుర్తికి రచ్చు మర్రీ, గంగలా పురం, ఆదిగానపల్లి ,బూదవర్తి ,తదితర గ్రామాలకు ప్రతిరోజు ప్రజలు వస్తూ పోతూ ఉంటారు. ఈ ప్రయాణికులకు సాయం త్రం 6:00 దాటింది అంటే చాలు పాదచారులు ద్విచక్ర వాహనదారుల మీద కుక్కలు ఎక్కడ మీద పడి పీకుతా యోనని భయంగా భయంగా ప్రయాణం సాగిస్తున్నామని ప్రజలు తెలిపారు. ఈ సర్కిల్ నందే దాదాపు 30 నుంచి 50 వరకు వీధి కుక్కలు రోడ్డుకు అడ్డంగా పనుకొని వచ్చి పోయే పాదాచారాలు వాహనదారులపై కుక్కలు విరుచుకుపడు తుంటాయి. గతంలో కూడా చాలామంది ప్రయాణికులు వాహనదారులు కుక్కలు వెంబడించడం వలన ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందకు పడి ఆస్పత్రి పాలయ్యారు. ఈ కూడలి నందు అయ్యప్ప స్వామి దేవాలయం మరియు శనీశ్వర స్వామి దేవాలయం ఆంజనేయ స్వామి దేవాలయము ఉన్నాయి, వీటికి దగ్గరలోనే చికెన్ షాపు దారులు చికెన్ వ్యర్థ పదార్థాలైనా ఈకలు పేగులు తదితర పదార్థాలు రోడ్డు పక్కనే పడేయడం వలన విటిని తినేందుకు కుక్కలు ఇక్కడే తిష్ట వేసి ఉంటాయి. చీకటి సమయంలో ద్విచక్ర వాహనదారులు వెంటబడి వెంబడిస్తూ ఉంటాయి రాత్రి సమయాల్లో ఈ దారంటు రావాలంటేనే భయం భయంగా ఉంటుందని ప్రజలు తెలిపారు. ఇదే అయ్యప్ప స్వామి గుడి శనీశ్వర స్వామి గుడి పక్కన పందులకు నివాసంగా మారింది ప్రతిరోజు ఈ పందులు మండల కేంద్రంలోకి వచ్చి మురికి కాలవలో ప్రజల మధ్యలో సవాసాలు చేస్తున్నాయి , వీటిని గురించి పంచాయతీ అధికారులకు ఊరికి దూరంగా పందులు నివాసాలను ఏర్పాటు చేయాలని పందులను ఊరిలోకి రాకుండా చూడాలని చెప్పిన పట్టించుకోవడం లేదు , దీనివలన దోమల వ్యాప్తి చెంది వివిధ రోగాలు బారిన పడుతున్నారు ప్రజలు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చికెన్ ఆమకదారులను పిలిచి సమావేశం ఏర్పాటు చేసి చికెన్ వ్యక్తపదార్థాలను సర్కిల్కు దూరంగా పడేసే విధంగా చర్యలు చేపట్టాలని. అలాగే దేవాలయాల దగ్గర ఉన్న పందుల నివాసాన్ని ఊరికి దూరంగా ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆశ్రమాలకు నిత్యవసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - తాడిపత్రి : మండలంలోని ఆవుల తిప్పాయ పల్లి వద్ద ఉన్న రమణ మహర్షి ఆశ్రమానికి, పట్టణంలోని శ్రీనివాసపురం, పప్పూరు రోడ్డులో ఉన్న సౌభాగ్య సింధు ఆశ్రమానికి సోమవారం ఇన్ ఫినిటీ ఫిన్ కార్ప్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఎండి శ్రీకాంత్ రావాల్కర్ ఆధ్వర్యంలో దాదాపు లక్ష 3వేలు విలువచేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. అలాగే ఆశ్రమంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పరుపులు, దుస్తులు, పుస్తకాలు, పాదరక్షలు, పెన్నులు పంపిణీ చేసినట్లు కంపెనీ ఏరియా మేనేజర్ కృష్ణ మామిల్ల తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా మేనేజర్ కృష్ణ మామిల్ల మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. మీరు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి ఇతరులకు కూడా సహాయం చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇస్కాన్ టెంపుల్ గోపి దేవి దాశి తమ ఆధ్యాత్మిక సందేశాన్ని విద్యార్థులకు తెలియచెప్పారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు భాస్కర్, ఈశ్వర్ రెడ్డి, బాబా ఫక్రుద్దీన్, హాజీవలి, కిరణ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర -ధర్మవరం : శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని ఎర్రగుంట లో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానమునందు నిర్వహించినటువంటి మానస నృత్య కళా కేంద్రం ఆధ్వర్యంలో శిష్య బృందం ఆలపించిన నాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. నాట్య గురువు మానస మాట్లాడుతూ పండుగ సందర్భంగా మా నృత్య కళా కేంద్రాన్ని ఆహ్వానించడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈనాటి ప్రదర్శనలో 20 మంది చిన్నారులు నిర్వహించిన నృత్యాలు అందరిని అబ్బురపరిచింది అని తెలిపారు. శ్రీరామచంద్రుని సంకీర్తనలతో చిన్నారుల నృత్యం చూసిన భక్తాదులు విశేషంగా తమ భక్తి భావాన్ని చప్పట్లతో మారుమోగించారు అని తెలిపారు. అనంతరం గురువు మానసను ఆలయ కమిటీ వారు సత్కరించారు. 20 మంది చిన్నారులకు ప్రశంసా పత్రాలను ఆలయ కమిటీ వారు అందజేశారు.

సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

విశాలాంధ్ర - పుట్టపర్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి సచివాలయాన్ని ఎమ్మెల్యే సింధూర రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం ఉదయం 10గంటలు దాటినా సచివాలయానికి తలుపులు తెరవకపోవడంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ అడిగారు. పొంతన లేని సమాధానం ఇవ్వడంతో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి మెమో జారీ చేయాలని సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి ప్రజలు వస్తుంటారని, మీరు ఇలా నిర్లక్ష్యంగా కార్యాలయానికి రాకుండా అలసత్వం ప్రదర్శిస్తారా అంటూ మండిపడ్డారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉన్నతాధికారులు తప్పనిసరిగా సచివాలయ సిబ్బంది పనితీరు పట్ల పర్యవేక్షణ కలిగి ఉండాలని సూచించారు. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనాదారులు నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - శింగనమల : మండల వ్యాప్తంగా వాహనాలకు నెంబర్ ప్లేట్లు రికార్డులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో ద్విచక్ర వాహనాలు అన్ని రకాల వాహనాలకు సంబంధించిన ఆర్ సి రికార్డ్స్ తప్పనిస రిగా ఉండాలి, అలానే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ నెంబర్ ప్లేటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్లు డ్రైవింగ్ చేసేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించుకో రాదన్నారు, యూనిఫామ్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు పైన తెలిపిన విధంగా వాహనదారులు వాహనాలు చూసుకోవాలని తెలిపారు. పైన తెలిపిన వాటిలో ఏదో ఒకటి లేని వారి వాహనాలు సీజ్ చేసి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి తరలిస్తామని సూచించారు, వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్లకు సన్మానం

విశాలాంధ్ర -అమరాపురం : మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నూతనంగా మడకశిర మార్కెట్ యార్డ్ డైరెక్టర్లుగా అమరాపురం రత్న శ్రీ చంద్రశేఖర్ గుప్తా, విరపాక్షప్పలను స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానం చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తమపై నమ్మకంతో పదవులను రైతులకు రైతు కూలీలకు న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్ మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, శివరుద్రప్ప, ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు జయకుమార్, నవీన్ కుమార్, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, రామిరెడ్డి, తమ్ముడేపల్లిపంచాయతీ కన్వీనర్ హనుమంతరాయ, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రఘు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ చంద్రశేఖర్ గుప్తా, మారుతి ప్రసాద్, దాదా పీర్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు నాగరాజ్, యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, ,డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, , చెరువు సంఘం అధ్యక్షుడు గురు సిద్ధప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెన్నప్ప, ప్రభాకర్, మంజు ,పుల్లికుంట నాగరాజు, రాజు, ఎంపీటీసీ ఓంకార్ నిరంజన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చెరువు మట్టికి అనుమతి ఇవ్వండి కలెక్టర్ సారూ..

విశాలాంధ్ర - పుట్టపర్తి : తమ భూములను సారవంత నేలలుగా మార్చుకోవడానికి చెరువు మట్టిని తోలుకునేందుకు అనుమతులు ఇవ్వాలని సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామానికి చెందిన రైతులు పుట్టపర్తి కలెక్టరేట్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతులంతా కలిసి కలెక్టర్ టీ.ఎస్.చేతన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చాలకూరు గ్రామంలో వున్న మా భూములను చదును చేసుకోవడం కొరకు మా ఊరి చెరువు మట్టిని తోలుకోవడానికి సోమందేపల్లి తహసిల్దార్‌కు అనుమతి కోరితే ఇవ్వలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎమ్మార్వో చెరువు మట్టి తోలుకునేందుకు రైతులకు అనుమతులు ఇవ్వకుండా, ఇటుకల బట్టి వారికి, దళారులకు అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. మా కుటుంబాలకు జీవన ఆధారం వ్యవసాయమేనని, మాకు వేరే ఆధారం ఏమీ లేదంటూ వాపోయారు. అధికారులు మట్టి తోలుకోవడానికి అనుమతులు ఇవ్వకపోతే మా కుటుంబాలకు ఆత్మహత్యే శరణ్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రైతు సంఘం అధ్యక్షుడు ఆకుతోట రామచంద్ర మాట్లాడుతూ చాలాకూరు గ్రామానికి చెందిన రైతులకు తమ భూముల్లోకి నల్లమట్టి తోలుకోవడానికి అధికారులు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆర్ సి పి ఆధ్వర్యంలో రైతులతో కలిసి తాసిల్దార్, కలెక్టర్ కార్యాలయాల వద్ద దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చాలకూరు గ్రామ రైతులు సోమశేఖర్, నవీన్ నరసింహమూర్తి, వెంకటేశు, రవి, రమేష్ జయరామప్ప, గోవిందప్ప, ఎర్రప్ప, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో శ్రద్ధను వహించాలి

విశాలాంధ్ర - ధర్మవరం : గ్రామ ప్రజలు అందరూ కూడా ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనపరచాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్. పుష్పలత తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా ధర్మవరం మండలం దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ ఈ ర్యాలీ నందు ప్రజల యొక్క ఆరోగ్య స్థితి మెరుగుపడడానికి ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించారు. ముఖ్యంగా మాతా శిశు మరణాలను తగ్గించడం, ప్రజల జీవన ఆరోగ్య విధానం, ఆహారపు అలవాట్లు మార్చుకొనడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని సాధించవచ్చని తెలి పారు. పిఎంజేఏవై కార్డ్స్ ద్వారా 70 సంవత్స రాల పైబడిన వారికి సంవత్సరానికి 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య సేవలు పొందవచ్చు అని తెలిపారు. ఇనిస్టిట్యూషనల్ డెలివరీస్ నిర్వహిం చడం వల్ల మాతా శిశు మరణాలను తగ్గించ వచ్చు అని తెలిపారు. టెలి మానస్ ద్వారా మానసిక ఆరోగ్య మద్దతుతో భారతదేశం ప్రజల యొక్క ఆరోగ్య కవరేజ్ పురోగమించేటట్లు చేయవచ్చని తెలిపారు. హాస్పిటల్ నందు ప్రసవం అయితే జె ఎస్ వై ద్వారా నగదు పరిహారం పొందవచ్చని తెలిపారు. అలాగే ప్రతినెల 9వ తేదీ ,10 వ తేది హై రిస్క్ గర్భవతులకి ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు అని తెలిపారు. ఈ కార్యక్రమం నందు వైద్య సిబ్బంది, సూపర్వైజర్ రాజశేఖర్ రెడ్డి, ఎంఎల్హెచ్పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కోదండ రాముని బ్రహ్మారథోత్సవం

విశాలాంధ్ర-చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరులో కోదండ రాముని బ్రహ్మ రథోత్సవం కన్నుల పండువగ సర్పంచ్ మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూపురం ఎంపీ పార్థసారధి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హిందూపురం శాసనసభ్యులు సహాయకార్యదర్శి వీరయ్య పెద్దలు దేమకేతేపల్లి అంజినప్ప మున్సిపల్ చైరపర్సన్ డి.ఇ రమేష్, మండల కన్వీనర్ రంగారెడ్డి ,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ ,వాల్మీకి బీసీ కార్పొ రేషన్ డైరెక్టర్ దేవనహల్లి ఆనంద్, జిల్లా అధ్యక్షు లు అంజినప్ప, ముఖ్య అతిథులుగా హాజరైనా రు, ఈ నేపథ్యంలో అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు అర్చనలు చేశారు, మంగళ వాయిద్యాలు నడుమ స్వామి వారిని బ్రహ్మారథమై కూర్చుండబెట్టి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని ముందుకు లాగారు. ఈకార్యక్రమంలో భక్తులకు తీర్థప్రసా దాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి నాయకులు నాగరాజు, కురుబ కార్పొ రేషన్ డైరెక్టర్ పరిమళ, తిప్పారెడ్డి వెంకటలక్ష్మి, శ్రీదేవి,నందీశప్ప,మంగేష్, అశ్వర్థప్ప, అంజమ్మ, మాజీ సర్పంచ్ చెన్నమ, ఎస్సై మునీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘ టనలు జరగకుండా సిబ్బందితో అప్రమత్తం చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-అమరాపురం : మండల కేంద్ర మైన అమరాపురంలో మాజీ ఎమ్మెల్సీ మడకశిర నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గుండుమల తిప్పేస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం చోళమాంబదేవి దేవాలయం నందు విశేష పూజలను తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయం వద్ద బారీ కేక్ కటింగ్ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్ మాజీ జెడ్పిటిసి నరసిం హమూర్తి, శివరుద్రప్ప, ఎస్సీ సెల్ నియోజ కవర్గం అధ్యక్షుడు జయకుమార్, జిల్లా టిఎన్ఎ స్ఎఫ్ కార్యదర్శి నవీన్, మాజీ ఎంపీపీలు కృష్ణమూర్తి, రామిరెడ్డి, తమ్ముడేపల్లిపంచాయతీ కన్వీనర్ హనుమంతరాయ, తదితర నాయకులు పాల్గొన్నారు. వీరాపురం నందు మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను స్థానిక నాయకులు చన్నప్ప రఘు రమేష్ తిప్పేస్వామి శివన్న తదితరుల తోపాటు కార్యకర్తలు జరుపుతున్నారు. హేమ వతి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకల సందర్భంగా హేంజేరు సిద్ధేశ్వర స్వామి దేవాలయంలో విశేష పూజలు నిర్వహించి భారీ ఎత్తున నాయకుల సమక్షంలో జన్మ దినవేడు కలను నిర్వహించారు. స్థానిక నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్ ,ఎస్సీ సెల్ నియోజ కవర్గ అధ్యక్షుడు జయ కుమార్, పట్టణ అధ్యక్షు డు నాగరాజు, యువ నాయకుడు మంజునాథ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - అగళి : మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి జన్మదిన వేడుకలను సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పిటి ఉమేష్,కన్వీన కుమార్ స్వామి, ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి బస్టాండ్ వద్దకు చేరుకున్నారు. బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేకను కట్ చేసి ఘనంగా గుండమల తిప్పేస్వామి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. అనంతరం శంకరే శ్వర స్వామి దేవాలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్ర మానికి జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు కోడిపల్లి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి జయన్న, మాజీ సర్పంచ్ రవికుమార్ మాజీ సింగల్ విండో అధ్యక్షులు ఇ రిగేపల్లి శ్రీనివాస్, సురేష్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శిల్ప కెంచు యాదవ్, సర్పంచులు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వికలాంగులు దరఖాస్తులు తీసుకోవాలి

విశాలాంధ్ర - యాడికి : 60సంవత్సరాలు నిండిన వృద్ధులు వికలాం గులు, వితంతువుల నుండి పింఛన్ కోసం దరఖాస్తులు స్వీకరించాలని కోరుతూ వైసీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు ఎంపీడీవో వీరా జుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. వికలాంగుల గోడు ప్రభు త్వం పట్టించుకోవడం లేదని ఇకనైనా వికలాంగులకు లబ్ధి చేకూరేలా వారి నుండి దరఖాస్తులు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - ఉరవకొండ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాకెట్ల గ్రామంలో ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిహెచ్ఓ నాగరంగయ్య హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎం డి షఫీ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ప్రారంభం. ఆశాజనకమైన భవిష్యత్తు అనేది నేటి ఆరోగ్య దినోత్సవ నినాదమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మతాశిశు మరణాలు తగ్గించడానికి ఆసుపత్రిలో కాన్పుల కోసం అనేక సదుపాయాలు కల్పించిందని ప్రజారోగ్యం మెరుగుపరచడానికి ఎప్పటికప్పుడు కొత్త కొత్త సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని వాటిని ప్రజలు వినియోగించాలని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల మరియు వయోవృద్ధుల కోసం కూడా ఎన్నో పథకాలు అమలులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సిబ్బంది ప్రజలతో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు

ఆరోగ్య కరమైన ప్రారంభం ఆశాజనక భవిషత్తులు

విశాలాంధ్ర - అనంతపురం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ఈ బి దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈర్యాలీ వైద్య శాఖ కార్యాలయం నుండి తెలుగు తల్లి విగ్రహం వరకు కొనసాగి తిరిగి వైద్య కార్యాలయం ముందు కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డియం హెచ్ఓడా ఈబి దేవి మాట్లాడుతూ ఈ సంత్సరం ఆరోగ్య కరమైన ప్రారంభం - ఆశాజనక భవిషత్తు అన్న నినాదముతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా వైద్య సేవా కారక్రమాలు ముఖ్యంగ క్యాన్సర్, టీబి, కుష్టు, చెక్కర వ్యాధి, బి పి మొదలగు వ్యాధులతో పాటు దోమలు ద్వారా వ్యాపించే వ్యాధులు నివారణ మరియు నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దని తెలియజేశారు. మాత, శిశు ఆరోగ్యం కోసం కూడా అనేక కారక్రమాలు నిర్వహిస్తున్నావని తెలిపారు. ఈ క్రమంలో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేసి వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కారక్రమంలో యన్సిడి ప్రోగ్రాం అధికారి డా.నారాయణ స్వామి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డెమో త్యాగరాజ్, ఆరోగ్య విద్యఅధికారి గంగాధర్, కార్యాలయ ఇతర సిబ్బంది ,ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు సచివాలయం ఏయన్యంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డీతోనే క్రాప్‌లోన్లు పునరుద్ధరణ చేయండి

విశాలాంధ్ర - యాడికి : బ్యాంకులలో క్రాప్ లోన్లు తీసుకున్న రైతులు క్రాప్ లోన్లు వడ్డీతోనే పునరుద్ధరణ చేయాలని సోమవారం విలేకరుల సమావేశంలో యాడికి మండల బిజెపి అధ్యక్షులు వద్ది రాజశేఖర్ లీడ్ బ్యాంకు అధికారులను కోరారు ఈ. సందర్భంగా వద్ది రాజశేఖర్ మాట్లాడుతూ ఖరీఫ్ పంట కాలంలో రైతులు క్రాప్ లోన్లు తీసుకున్నారని అనావృష్టి అతివృష్టి, అనావృష్టితో రైతులు పంటలు బాగా దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. క్రాప్ లోన్లు పునరుద్ధరణ ప్రారం భం కానన్న తరుణంలో కేవలం వడ్డీ మాత్రమే కట్టించుకొని క్రాప్ లోన్లు పునరుద్ధరణ చేయాలని యాడికి మండల బిజెపి కన్వీనర్ వద్ది రాజశేఖర్ బ్యాంక్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు మురళి,నాగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.